
# భావ-విభావరి

- ఎ.శ్రీధర్



సంజయ్ గుప్తది, వంశ పారంపర్యంగా లభించిన కమీషన్ వ్యాపారం. అతని పని, టెలిఫోన్ ద్వారా ఆర్డర్లు తీసుకోవడం, వాటి కొనుగోలుకి, రవాణాకి సంబంధించిన పనులన్నీ 'టెలిఫోన్' ద్వారానే చేసెయ్యడం, కమీషన్- కొట్టేయడం, అంతే!

అరడజను టెలిఫోన్లు, ఆఫీసు రూములో 'ఆ చివర నుండి ఈ చివరి వరకు' పరిచిన పట్టుపరుపులు వాటి మీద రకరకాల ఆకారాలు సైజులలో బాలీసులు, ఇవే అతని సాధన సంపత్తి. ఒకే ఒక గుమాస్తా, ఒక కారు డ్రైవరు అతని ఆఫీసు స్టాఫ్!

అతని ఇల్లు రెండంతస్తుల భవనం, దిగువన ఆఫీసు మీదన నివాస గృహం. మీదనున్న ఇంటికి యజమానురాలు అతని భార్య మీనాక్షి. ఆమెకి వంటపని, ఇంటి పని వగైరాలలో సాయంచేసేందుకు ఒక పనిమనిషి ఉంది.

ఆరోజు ఎప్పటిలాగే, సంజయ్, ఆఫీసు రూములో గోడకి ఆనించిన బాలీసుల మీద చారబడి, పరుపు మీద కాళ్లు చాపుకొని కూర్చొని, తదేకంగా, 'ఉన్నతివైపు- చూడసాగాడు.

'ఉన్నతి', పిటపిటలాడే, పాతికేళ్ల పరువంగల యువతి. గుండ్రని ముఖం, అల్చిప్పల్లాంటి కళ్లు, సూది ముక్కు, బత్తాయిల్లాంటి బుగ్గలు కలిగి కుదురుగా బొద్దుగా ఉంటుంది. యజమానురాలు, 'మీనాక్షి'కి ఇంటి పనిలో సాయంచేస్తూ, నలభై అయిదేళ్లు దాటిన, సంజయ్ గుప్త గుండెల్లో గుబులు పుట్టిస్తూ ఉంటుంది.

దిగువ హాలులో పనిపూర్తిచేసిన, ఉన్నతిని, 'మరికాస్త' చూసేందుకు, మేడమీదికి వెళ్లాడు సంజయ్.

మీనాక్షి మంచంపైన కాళ్లు చాపుకొని కూర్చొని ఉంది. ఆమె కాళ్లదగ్గర మంచానికి దిగువ, 'మాణిక్యం' కూర్చొని ఉన్నాడు. 'మాణిక్యం' ఆ ఇంటికి నౌకరు, 'కారుకి' డ్రయివరు.

"ఏం జరుగుతోందిక్కడ?" మాణిక్యం నీ కాళ్ల దగ్గర ఎందుకు కూర్చొన్నాడు? ఆశ్చర్యంతో అడిగాడు సంజయ్.

"మాణిక్యానికి, ఆక్యుప్రెషర్ చికిత్స తెలుసండీ! వాడి దగ్గర ఒక 'మేజిక్ స్టిక్' ఉంది... అయ్యగారికి, చూపించు మాణిక్యం!" అంది మీనాక్షి.

మాణిక్యం తన చేతిలో ఉన్న అయిదంగుళాల కర్ర పుల్లని చూపించాడు. "దీన్ని, జిమ్మి అంటారండీ, అయ్యగారూ!" అన్నాడు పళ్లు ఇకిలించి.

"ఆ జిమ్మీతో అరి పాదాలలో ఉన్న నరాలని పొడుస్తే మొణుకుల నొప్పులు తగ్గుతాయటండీ! మాణిక్యం చాలా బాగా పొడుస్తున్నాడండీ!" అంది మీనాక్షి.

"నువ్వెప్పుడూ ఇంతే? డాక్టర్లు ఇచ్చిన మందులు- మింగవు. ఖర్చులేని చిట్కాలతో ఒళ్లు పొడిపించుకొంటూ ఉంటే నొప్పులుపోతాయా?... ఇంతకీ, 'ఉన్నతి' ఏదీ?"

"వంటింట్లో గిన్నెలు తోముతోంది. అయినా దానితో ఏం పని మీకు?" కనుబొమలు ముడివేసి అడిగింది.

మీనాక్షి సంజయ్ గతుక్కుమన్నాడు. "మరేం లేదే! హాలులో టెలిఫోన్లు తుడవకుండా వెళ్లిపోయింది" అన్నాడు.

అదే సమయంలో టెలిఫోన్ మ్రోగింది, "అమ్మో! బిజినెస్ కాల్ అయి ఉంటుంది" అంటూ, వడివడిగా మెట్లు దిగి, ఒక్క అంగలో పరుపు మీదకి దూకి, టెలిఫోన్ అందుకొన్నాడు. సంజయ్, "హలో!" అంటూ.

"నేనురా! ఏకనాథాన్ని! నన్ను అర్జెంటుగా, నీ ఇల్లున్న ఇరుకు సందు దాటి, మెయిన్‌రోడ్‌కి రా! ఇక్కడ కారులో వెయిట్ చేస్తున్నాను."

"ఎందుకు? ఏం కొంపమునిగింది?"

"కొంప ముంచడం కాదు, ఆకాశంలో తేలే ఏర్పాటు చేస్తున్నాను. నాతోపాటు అర్జెంటుగా ఊరి బయటకి రావాలి. 'ఉన్నతి' సాధించే మార్గం చెప్తాను."

"ఉన్నతా!" చెవిలో పాలుపోసినట్లుంది సంజయ్‌కి. "సరే వస్తాను, మరి బిజినెస్?"

"నీ బోడి బిజినెస్, 'గుమాస్తా' చూసుకొంటాడులే! త్వరగా, రా!"

* * *

కారు ఊరి బయట, 'మండూక మహాముని' ఆశ్రమం చేరుకొంది. మండూక మహాముని, మండూకాసనంలో కాళ్లు ముడిచి, చేతులు పొట్టకి ఆన్చి, ముఖాన్ని ముందుకు చాచి కూర్చొని ఉన్నాడు. అతని 'ఆసనం' క్రింద చిల్లర-నాణాలు వెదజల్లబడి ఉన్నాయి. మెడలో 'రూపాయి బిళ్లలతో చేసిన హారం వ్రేలాడుతోంది. ఆహారంలోని ఒక రూపాయి- బిళ్లని నోట కరచుకొని దర్శనమిచ్చాడు, కారులో వచ్చిన భక్తులకి.

వారిద్దరూ అతనికి నమస్కరించారు.

"ఏం పనిమీద వచ్చారో స్వామివారికి విన్నవించండి." అన్నాడు, ప్రక్కనే నిలబడి, 'వింజామర' వీస్తున్న ఒక శిష్యుడు.

"స్వామీ! నాకు 'ఉన్నతి' కావాలి..."

సంజయ్ మాటలని సగంలోనే కట్ చేసి, "ఉన్నతి ఆర్థికంగాను, వ్యాపారంలోను, ఇలా సర్వతోముఖంగా కలగాలి" సరిదిద్దాడు ఏకనాథం.

"కాదు స్వామీ! నాకు 'ఉన్నతే'కావాలి" గొణిగాడు సంజయ్.

మండూక ముని తల ఊపాడు. నోటిలో ఉన్న రూపాయి బిళ్లని తుపుక్కున ఉమ్మేసి, "ఎవరికి కావలసిన 'ఉన్నతి' వారికి లభిస్తుంది." అని "శిష్యా!" అని పిలిచాడు.

"స్వామీ!"

"ఈ భక్తులిద్దరికీ నా ప్రతిమలిచ్చి పంపించు."

"అలాగే స్వామీ!" అంటూ ఆ వింజామర శిష్యుడు గురువు నోటికి, హారంలోని మరో రూపాయి బిళ్లని అందించి, భక్తులిద్దరినీ తనతో రమ్మని సైగ చేసి, వెనకనున్న గదిలోకి తీసుకెళ్లాడు. ఆ గదిలో ఒక 'రేక్' నిండా ఉన్నాయి. 'మండూక-ప్రతిమలు'. 'మూడు కాళ్ల కప్ప బొమ్మలు'. కాలి క్రింద రూపాయి నాణేలు, నోటిలో రూపాయి బిళ్లతో, ఆ మునికి ప్రతిరూపంగా తయారుచెయ్యబడి ఉన్నాయి.

"వెయ్యిన్నూట పదహార్లు దక్షిణ ఇచ్చి, చెరొక బొమ్మ తీసుకోండి" అన్నాడు శిష్యుడు.

"కోరిక తీరాలంటే ఏంచేయాలి?"

"ఏకాంతంలో, మండూక మహామునిని మనసారా తలచుకొని, ఈ బొమ్మని ముద్దుపెట్టుకోవాలి."

"ఉన్నతి లభిస్తుందా?"

"మండూక మహాముని కృపవల్ల తప్పక లభిస్తుంది."

* * *

"నేనీ రాత్రి ఆఫీసులోనే పడుకొంటాను. ముఖ్యమైన 'బిజినెస్ కాల్ ఉంది'" అన్నాడు సంజయ్. మీనాక్షి మౌనంగా తల ఊపి, మేడ మీద పడక గది తలుపులు మూసేసింది. తలుపులు మూస్తూ అతనికి 'గుడ్‌నైట్' చెప్పింది మీనాక్షి.

ఇవాళ నాకు నిజంగా గుడ్‌నైటే! అనుకొన్నాడు సంజయ్. ఆఫీసు గదిలోకి వెళ్లి పరుపులు సర్ది, బాలీసులు

అందంగా అమర్చి, "టయిం" చూసుకొన్నాడు. రాత్రి 8.30 అయింది. ఇప్పుడుకాదు, మరో రెండుగంటలు దాటాక, 'మీనాక్షి ఆదమరిచి నిద్రించాక, ఆ 'ప్రయోగం' చేయాలి. అనుకొన్నాడు. భద్రంగా దాచిన 'కప్పబొమ్మని' టెలిఫోన్ స్టేండ్ మీద పెడుతూ. అంత వరకు, 'టయింపాస్'కోసం, డి.వి.డి ప్లేయర్‌లో, మంద్ర స్థాయిలో మెలోడీ సాంగ్స్ వింటూ, కనులు మూసుకొని, ఆ పాటల సన్నివేశాలనీ, వాటిలో తనతో పాటు, 'ఉన్నతినీ' ఊహించుకొని మురిసిపోతూ, మాగన్ను కునుకులో పడ్డాడు.

ఎదురుచూసిన సమయం వచ్చింది. మండూక మునిని తలచుకొని, కప్పబొమ్మని చేతులోకి తీసుకొని ముద్దుపెట్టుకొన్నాడు సంజయ్.

ఆశ్చర్యం!

కప్పబొమ్మ చేతిలోంచి జారి, మూడు గెంతులు గెంతి, 'ఉన్నతి'లాగ మారిపోయింది. సంజయ్ ఆనందానికి పట్టపగ్గాలు లేకుండాపోయింది. మక్కువతో ఉన్నతిని దగ్గరకి తీసుకొని ముద్దాడబోయాడు.

"వద్దు!" సుతారంగా అడ్డుకొంది ఉన్నతి. "మళ్లీ ముద్దుపెట్టుకోవద్దు" అంటూ. అర్థంకాక అయోమయంలో పడిన సంజయ్‌ని చూసి గలగలా నవ్వుతూ, "మళ్లీ ముద్దుపెట్టుకొంటే నేను బొమ్మని అయిపోతాను" అంది.

"అదా రహస్యం!" అన్నాడు సంజయ్. "బాగానే ఉంది, కాని ముద్దులేకుండా ముచ్చటలెలా తీరుతాయి?" గోముగా అడిగాడు సంజయ్.

"ఏమో! మీకే తెలియాలి, కావాలన్నారుగా, వచ్చాను."

సరిగా అదే సమయంలో ఆఫీసు తలుపులు గభాలున తెరచుకొని లోపలికి వచ్చింది మీనాక్షి.

"నువ్వా?" అన్నాడు సంజయ్ గాభరాతో.

"అవును నేనే! మీ తిక్కవేషాలు నాకు తెలియవనుకొన్నారా, ఏం? ఏకనాథంతో ఫోన్‌లో మాట్లాడిన మాటలు ఎక్స్‌టెన్షన్‌లో విన్నప్పుడే నాకు అనుమానం వచ్చింది. అందుకే క్లోజ్‌గా మీ వాలకం గమనిస్తూనే ఉన్నాను. ఇంతకీ అదేదీ? దాని వీపు చీరుస్తాను." అంది మీనాక్షి. కోపంతో ముక్కుపుటాలు అదురుతూండగా.

"ఎవరూ లేదే?" అన్నాడు సంజయ్, అతని బుర్రలో తక్షణం ఒక అయిడియా వచ్చింది.

"ఉన్నతి! ఇంకెవరు? ఇలా రావే..."

సంజయ్ ఒక్క అంగలో ఉన్నతి వైపు దూకి, చటుక్కున ఆమె బుగ్గమీద ముద్దుపెట్టుకొన్నాడు.

అంతే! ఉన్నతి కింద కూర్చొండిపోయి, కప్పబొమ్మగా మారిపోయింది. "చూసావా అంతా నీ భ్రమ! గదిలో ఎవ్వరూ లేరు. నువ్వే ఏదేదో ఊహించుకొంటున్నావ్!" అన్నాడు సంజయ్, ఆ బొమ్మని చూపిస్తూ.

"నా దగ్గర కాదు ఈ వేషాలు. ఆ బొమ్మని ఇలా ఇవ్వండి" అంటూ దాన్ని అందుకొని, "ఏం చేస్తే ఇది మళ్లీ మనిషిగా మారుతుందో చెప్పండి," అంది హుంకరిస్తూ.

**మీ తిక్కవేషాలు నాకు తెలియవనుకొన్నారా, ఏం? ఏకనాథంతో ఫోన్‌లో మాట్లాడిన మాటలు ఎక్స్‌టెన్షన్‌లో విన్నప్పుడే నాకు అనుమానం వచ్చింది. అందుకే క్లోజ్‌గా మీ వాలకం గమనిస్తూనే ఉన్నాను.**

"బొమ్మ, మనిషి అవడమేమిటి? నీ పిచ్చిగాని..." బదులిచ్చాడు సంజయ్.

"మర్యాదగా చెప్తారా? లేకపోతే ఏకనాథానికి ఫోన్ చేసి కనుక్కోమంటారా?" బెదిరించింది మీనాక్షి.

సంజయ్ గొంతులో వెలక్కాయ, 'పచ్చిది' పడింది. 'అవసరం లేదు, చెప్తానుండు, మండూక మునిని తలచుకొని, ఆ బొమ్మని ముద్దుపెట్టుకోవాలి" అన్నాడు చేసేది లేక.

మీనాక్షి ఆ బొమ్మని చేతుల్లోకి తీసుకొని, శ్రద్ధతో కళ్లు మూసుకొని, మండూక మునిని ప్రార్థించి, ముద్దుపెట్టుకొంది.

అంతే!

ఆ కప్పబొమ్మ క్రిందకి జారి, మూడు గెంతులు గెంతి, మనిషిలా మారిపోయింది.

అలా మారిన మనిషి!... 'షి!' ఉన్నతి కాదు, 'హి'! మాణిక్యం!! మీనాక్షి కెవ్వున కేక వేసింది, "ఇదేమిటి ఇలా అయింది?" అంటూ.

"ఏమయింది, నీ మనసులో కుళ్లు బయటపడింది."

"జాగ్రత్తగా మాటలు రానీయండి. ఆ కుళ్లంతా మీ మనసులోనే ఉంది. నేను గదిలోకి రావడానికి ముందు, మీరు దాన్తో కులకడం లేదూ?"

"నన్ను అనే నైతిక హక్కు నీకు లేదే, శనిగొట్టుమొకమా ముందు వీడి పని పట్టానుండు" అంటూ, మాణిక్యాన్ని ముద్దుపెట్టుకొన్నాడు. మాణిక్యం కప్పలాగ మారిపోయాడు.

ఆఫీసు గదిలో లైటు ఆరిపోయింది. సంగీతం ఆగిపోయింది. మాగన్నుగా పడుకొని ఉన్న సంజయ్ ఉలిక్కిపడి లేచి, చుట్టూ కలయచూసాడు. అంతా చీకటిగా ఉంది చీకటి తప్ప అంతా మామూలుగానే ఉంది.

ఆ చీకటిలో తననితాను సింహావలోకనం చేసుకొన్నాడు. తాను కన్నదంతా కలేనని, తన ఆలోచనల ప్రతిరూపమేనని అతనికి అర్థమయింది. తన చీకటి ఆలోచనలని మీనాక్షికి కూడ ఆపాదించడం, అతనికి సిగ్గు కలిగించింది. వెంటనే లేచి ఆ చీకటిలోనే లైట్ స్విచ్ ఆఫ్ చేసి, మేడమీద పడక గదికి దారి తీసాడు.

అతను మెట్లు ఎక్కుతూ ఉండగా లైట్లు వచ్చాయి.

* * *

నాలుగు పదులు దాటిన వ్యక్తుల జీవితంలో అసంతృప్తి (చాలని సంపాదన; సంతానలేమి; ఆకర్షణ కోల్పోయిన భార్య లేక భర్త) 'మానసిక భావ విభావరికి' లోనుచెయ్యడం సహజం. వివేకము, ధ్యానము, ఏకాగ్రత, కఠిన పరిశ్రమల ద్వారా, దానిని విజయవంతంగా ఎదుర్కోవాలి తప్ప- దగ్గరకు తీసుకొని ముద్దాడకూడదు. అలాచేస్తే 'ఉన్నతి' అవకాశవాదులకి మాత్రమే లభిస్తుంది.

* * *

"ఏమండీ! ఒక్కసారి మండూక మహాముని దగ్గరకు వెళ్దామండీ, మనకి సంతానం లేదుకదా..." గోముగా అడిగింది మీనాక్షి.

సంజయ్ సరేనన్నాడు.

ఫలితంగా మరో కప్ప మేడమీదికి ఎక్కింది. ★

**రచయిత చిరునామా:**
**ఎ.శ్రీధర్, కేరాఫ్ ఎ.రాజేష్,**
ప్లాట్ నెం.448/ఎ; బిల్డింగ్ పి3: రూమ్-4
మొరాజ్ రివర్‌సైడ్ పార్క్,
టక్కా (పోస్ట్) పాన్‌వెల్,రాయగడ్ జిల్లా,
నవీ ముంబాయి, మహారాష్ట్ర.

